ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె - 9985411377

మార్గం సుగమం

చూస్తూ ఉండగానే ఐదేళ్లు గిర్రున తిరిగాయి. 2019లో జగన్ పాలన ప్రారంభమైనప్పటి నుంచి 2024లో గద్దె దిగే వరకూ రాష్ట్రం అల్లకల్లోలంగా మారింది. అన్ని రంగాల్లోనూ రాష్ట్రం పరిస్థితి దారుణంగా దిగజారిపోయింది. ఒక ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా రహదారులు బాగుండాలి. కానీ జగన్ ఐదేళ్ల హయాంలో ఆ రహదారులన్నీ ధ్వంసమయ్యాయి. గతుకుల రోడ్లపై తిరగడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ ఈ ఏడాది మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగి, జూన్ 12వ తేదీన ఎన్డీయే కూటమి అధికారంలో వచ్చింది. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చీ రాగానే రోడ్ల బాగుకు పూనుకున్నారు. ముందుగా గుంతల రోడ్లను పూడ్చి గతుకులకు అతుకులు వేసే కార్యక్రమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులు చూడాలన్న బృహత్తర కార్యక్రమం వేగంగా నడుస్తోంది.

- గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో అధ్వానంగా రోడ్లు
- నడవడానికి ప్రజల నరకయాతన
- అధికారంలోకి వచ్చీరాగానే దృష్టి సారించిన కూటమి
- గ్రామీణ, రాష్ట్ర పరిధిలోని రోడ్లకు నిధులు విడుదల
- చకచకా జరుగుతున్న పనులు





2024 వెలుగు నీడలు

● రూ.10.20 కోట్లతో మరమ్మతులు



నాడు...

ప్యాపిలి మండలం ఊటకొండ గ్రామం అంతర్గత రోడ్డు పరిస్థితి



నేడు...

ప్రస్తుతం కొత్తగా వేసిన సిమెంటు రోడ్డు

నంద్యాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రహదారులు అభివృద్ధికి సూచికలు. రోడ్లు బాగుంటేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది. ఇతర ప్రాంతాలను అనుసంధానం చేయగలిగే రోడ్లు సక్రమంగా ఉంటే వ్యాపారాభివృద్ధి కూడా బాగా జరుగుతుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ కోణంలో ఎపుడూ ఆలోచించలేదు. దీంతో జిల్లాలోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పాడైపోయిన రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవటంతో ప్రయాణం చేయాలంటేనే ప్రయాణికులు భయపడే పరిస్థితి ఏర్పడింది. ఇక రోడ్లను బాగు చేసేందుకు గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఏడు సార్లు టెండర్లకు పిలిచినా ఖజానా నుంచి నిధులు విడుదల కావన్న భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. జిల్లాలోని గ్రామీణ, రాష్ట్ర రహదారులను బాగు చేసేందుకు నిధులు విడుదల చేయటమే కాకుండా, పనులు చకచకా జరిగేలా చూస్తోంది. దీంతో జిల్లాలోని పాడైపోయిన రోడ్లు చక్కగా మారి రవాణా, ప్రయాణాలు ఇబ్బంది లేకుండా సాగుతున్నాయి.

గత ఐదేళ్లలో జిల్లాలోని ఆర్అండ్‌బీ రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాకు చెందిన బీసీ జనార్దన్‌రెడ్డి ఆర్అండ్‌బీ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని రోడ్లకు ఎక్కడెక్కడ మరమ్మతులు అవసరమో సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. ఇక ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం 'రోడ్ల రహిత గుంతలు' కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మంత్రి బీసీ జిల్లాకు నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఆయన చొరవతో జిల్లాలోని ఆర్అండ్‌బీ పరిధిలోకి వచ్చే 430 కి.మీ రోడ్లను బాగు చేసేందుకు రూ.10.20 కోట్లు విడుదల చేయించారు. ఈ నిధులను ఆయా నియోజకవర్గాల్లోని రోడ్ల గుంతలు పూడ్చటం, ముళ్లపొదలను తొలగించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను మొదటి, రెండో, మూడో విడతలుగా విభజించి పనులు మొదలుపెట్టారు. వీటికి సంబంధించిన పనులు ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఇప్పటికే దాదాపు 85 శాతం పనులు పూర్తయ్యాయి. జనవరి 10 లోపు మిగిలిన పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

● గ్రామీణ రోడ్లకు మోక్షం..

పల్లెలు పట్టుగొమ్మలు అనే నానుడిని జగన్ ప్రభుత్వం ఒక్క రోజు పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామాలకు వచ్చే కేంద్ర నిధులను కూడా వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించింది. దీంతో గ్రామాల్లో అత్యవసర పనులకు కూడా జరగలేదు. ఇక రోడ్ల పరిస్థితి అయితే చెప్పనక్కర లేదు. ఏ గ్రామాని వెళ్లే దారులు, అంతర్గత రోడ్లు ఉన్నాయా, లేవో అనే పరిస్థితి ఉండేటంతో ఆయా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగానే కాక, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామీణ రహదారులు పట్ల దృష్టి సారించారు. తక్షణ వాటి మరమ్మతులకు పూనుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లోని రోడ్లను బాగు చేసేందుకు రూ.85.40 కోట్లు నిధులు విడుదల చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 8 కి.మీ బీటీ రోడ్లను, అలాగే 160 కి.మీ మేర సిమెంటు రోడ్ల పనులను మొదలుపెట్టారు. బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి 2 బీటీ పనులు, ఆత్మకూరు నియోజకవర్గంలోని 1 బీటీ రోడ్డుకు సంబంధించిన పనులు అభివృద్ధి దశలో ఉన్నాయి. అలాగే సిమెంటు రోడ్లు ఇప్పటి వరకు 120 కి.మీ మేర పూర్తయ్యాయి. మిగిలిన పనులు త్వరలోనే పూర్తి చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

నాడు...



చాగలమర్రి మండల కేంద్రం భూమా నగర్‌లోని రహదారి పరిస్థితి

నేడు



కొత్తగా వేసిన సీసీ రోడ్డు

● మరిన్ని నిధుల కోసం..

రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే నిధులతో ఇప్పటికే జరుగుతున్న పనులకుతోడు, నాబార్డు నుంచి మరిన్ని నిధులు రాబట్టి ఇంకా ఎక్కువ పనులు చేపట్టేందుకు సంబంధిత మంత్రి, అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి దాదాపు రూ.90 కోట్ల అంచనా వ్యయంతో నాబార్డుకు నివేదిక పంపించారు. ఈ నిధులతో సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లు చేసే అవకాశం ఉంది. ఆత్మకూరు నియోజకవర్గం వేల్పనూరు నుంచి గడివేముల, గోస్పాడు మండలం యాళ్లూరు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్లు చేయనున్నారు. ఇలా రోడ్లు వెడల్పు అయ్యే అవకాశం ఉంది. ఇక ఆయా ఆర్అండ్‌బీ రహదారుల్లో దెబ్బతిన్న కల్వర్టులు, వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.17 కోట్లను విడుదల చేసింది. వీటికి సంబంధించి మరో వారం పది రోజుల్లో అధికారులు టెండర్లను పిలిచి కాంట్రాక్టర్లకు పనులను చేపట్టనున్నారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు వేగంగా పని చేయటం, ప్రభుత్వం అదే మాదిరి స్పందించి నిధులు విడుదల చేస్తుండటంతో రోడ్లు బాగు పడుతున్నాయి. ఇక ముందు కూడా ఇలాగే పనులు జరిగితే జిల్లాలోని రోడ్లు మెరిసిపోయే అవకాశం ఉంది.

వివరాలు 7లో...

పదవుల భర్తీకి సహకారం

- సహకార సంఘాలు, మార్కెట్ కమిటీల భర్తీకి నిర్ణయం
- నేతలు, అనుచరుల్లో సంబరాలు
- ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం క్యూ కట్టిన కింది స్థాయి నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రెండు రోజుల కిందట రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పదవుల భర్తీని సంక్రాంతి లోపు చేపడుతామని ప్రకటించడంతో ఆ పదవులపై ఆశలు పెట్టుకున్న కీలక నేతలు, చోటా మోటా నాయకులు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. తమకు ఆ పదవులు దక్కితే తమ జీవితాలు ధన్యమైనట్లేనని ఆశల పల్లకిలో విహరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు ఉన్నాయి. 2018 నుంచి ఈ సంఘాలకు సహకార బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సిఫారసు మేరకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసింది. అప్పట్లో సంఘాల్లో రైతులకు రుణాలు ఇప్పించే విషయంలో ఎన్నెన్నో అక్రమాలు జరిగాయి. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకునే వారు కరువయ్యారు. రుణం కోసం రైతులు సంఘాల కార్యాలయాలకు వెళితే మాకు ఎంత ఇస్తావు అంటూ త్రీమెన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేయడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక త్రీమెన్ కమిటీలను రద్దు చేసింది. వారి స్థానంలో అధికారుల నేతృత్వంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో సహకార శాఖలోని అధికారులు, ఉద్యోగులు పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు జాయింట్ కలెక్టర్లు పర్సన్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. దాదాపు ఏడు నెలలు అధికారుల పర్యవేక్షణలోనే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిర్వహణ అధికారులే చూస్తుండటంతో తమకు ఎటువంటి ప్రాధాన్యత లేక పోవడం దారుణమని, ఎమ్మెల్యేల అనుచరులు, గ్రామాల్లోని చోటామోటా నాయకులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఈ పరిస్థితిని కీలక నేతలు గ్రహించారు. మరో దారి లేక ఎమ్మెల్యేల సిఫారసుతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను పార్టీలోని ముఖ్యమైన నేతలతో భర్తీ చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వ పెద్దలు వచ్చారు.



● **ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు క్యూ:** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించడంతో ఈ విషయంలో ఎమ్మెల్యేల సిఫారసులు పరిగణనలోకి తీసుకోవడంతో ఈ పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు, గ్రామాల్లోని చోటా మోటా నాయకులు ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు క్యూ కడుతున్నారు. అదే విధంగా మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల కోసం కూడా ప్రభుత్వం ఎమ్మెల్యేల సిఫారసులనే పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటిలో కర్నూలు, నంద్యాల, ఆదోని జీన్, బనగానపల్లె, ఆలూరు, కోడుమూరు, నందికొట్కూరు, ఆత్మకూరు మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఎమ్మెల్యేల ప్రాపకం పొందేందు కోసం నాయకులు తమ ప్రయత్నాలు మొదలు పెట్టేశారు. ఈ పదవులు ఎవరికి దక్కుతాయోనని కూటమిలోని ప్రధాన భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు ఎదురు చూస్తున్నారు.

పదింతల ప్లానింగ్

వంద రోజుల తరగతులకు శ్రీకారం

విద్యాశాఖ ఎస్ఈఆర్టీ ఆధ్వర్యంలో సిద్ధం



విద్యార్థులకు స్టడిమెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం, యూటీఎఫ్ నాయకులు

చాగలమర్రి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా పదోతరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యా శాఖ అధికారులు పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ మేరకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. నంద్యాల జిల్లాలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వం నిర్ణయించిన కాలనిర్ణయ పట్టికతో పాటు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి ప్రత్యేక శ్రద్ధతో వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో తెలియజేస్తూ మెలకువలు చెబుతున్నారు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా పది పరీక్షల్లో శతశాతమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. - వివరాలు 7లో..



ఏసుకృపమినిస్ట్రీస్‌లో ప్రార్థనలు చేస్తున్న ఫాధర్ అందనం సుధాకర్

క్రీస్తు జననం

మానవాళికి శుభదినం

- ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలి
- సమాజానికి క్రైస్తవ మతపెద్దల పిలుపు
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు జననం మానవవాళికి శుభదినం అని నంద్యాల డయాసిస్‌లో రెవరెండ్ సంజయ్‌మధు, రెవరెండ్ కొత్తమోని జోసప్‌లు పేర్కొన్నారు. నంద్యాల హోలిక్రాస్ కెథడ్రల్ చర్చిలో మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రీస్తు జన్మవృత్తాంతం గురించి పాస్టర్లు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. క్రీస్తు మానవరూపంలో పశువుల పాకలో యేసు పవిత్రహృదయం జన్మనిచ్చిన శుభదినమే క్రిస్మస్ అని అన్నారు. చీకటి నిండిన ఈ లోకంలో నింగినుంచి తార భువికి దిగినవేళ క్రీస్తులోకానికి వస్తూ ప్రేమ సందేశం, శాంతి సందేశం తీసుకొని వచ్చాడని తెలిపారు. క్షమాగుణమనే ఆయుధంతో శాంతి దీపాన్ని వెలిగించి ప్రతి ఒక్కరి హృదయాల్లో క్రిస్మస్ వెలుగులు నింపారన్నారు. సర్వమానవాళికి ప్రేమసందేశం అందించిన సంతోషకరమైన శుభదినమే క్రిస్మస్ అని తెలిపారు. సాయిబాబా నగర్‌లోని ఏసుకృపా మినిస్ట్రీస్‌లో పాస్టర్ అందనం సుధాకర్, తెలుగుబాపిస్టు రక్షణాలయంలో ఫాదర్ విజయ్‌భాస్కర్, హోసన్నా మందిరంలో ఫాదర్ అనిల్, ఫాస్టరేట్ 1లో జోసెఫ్, పాస్టరేట్ 2లో ఇమ్మానియేలు, ఫాస్టరేట్ 3లో నందం ఐజక్, ఫాస్టరేట్ 4లో సువార్తయ్య ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.



ఆత్మకూరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ముసురు ముప్పు..!

- తడిసిన వరి, మినుము, మొక్కజొన్న
- ఆందోళనలో అన్నదాతలు



నగల్లపాడు గ్రామ సమీపంలో ఒంటెద్దుబండ్లతో తరలిస్తున్న వరి బస్తాలు



రుద్రవరం మండలం చిన్నకంబలూరు సమీపంలో వరి ధాన్యం బస్తాలు ట్రాక్టరుకు లోడు చేస్తున్న దృశ్యం

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడటంతో చాగలమర్రి మండలంలో బుధవారం తెల్లవారు తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రహదారులు, పొలాల్లో ఆరబెట్టుకున్న వరి, మినుము, మొక్కజొన్న, జూట్ ధాన్యం తడిసిపోయింది. మొన్నటి వరకు తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ మరో అల్పపీడనంతో కంటిమీద కునుకులేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి జల్లులు కురవడంతో పంట పొలాలకు వెళ్లి ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు రైతులు ట్రాక్టర్లు, ఎద్దులబండ్లతో ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి గృహాలకు చేరవేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని, దీంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.



రుద్రవరం మండలం ఓ ప్రైవేటు గోడౌను వద్ద క్యూలో ఉన్న ట్రాక్టర్లు

రాలుతున్న చినుకులు.. ఆవిరవుతున్న ఆశలు

రుద్రవరం: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బుధవారం తుఫాను ప్రభావంతో స్వల్పంగా వర్షం కురిసింది. రైతులు వరి ధాన్యం రాశులపై పట్టలు కప్పడంలో నిమగ్నమయ్యారు. కొండమాయపల్లె నుంచి గాజులపల్లె మెట్ట వరకు వరి ధాన్యం రాశులు రహదారి వెంట కిలోమీటర్ల మేర ఉన్నాయి. కోటకొండ, యల్లావత్తుల టి.కొట్టాల, శ్రీరంగాపురం, చిన్నకంబలూరు ఇంకా పలు గ్రామాల్లో తుఫాను ప్రభావంతో స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో రైతులు ట్రాక్టర్లలో వరిధాన్యం బస్తాలు నింపుకుని పంట పొలాల నుంచి గ్రామాలకు తరలిస్తున్నారు. మరికొందరు ప్రైవేటు గోడౌన్లకు తరలించడంతో గోడౌన్ల వద్ద పదుల సంఖ్యలో ట్రాక్టర్లు బారులుదీరాయి.



చాగలమర్రి సర్వీసు రహదారిలో వరి ధాన్యంపై పట్టలు కప్పిన రైతులు






మత పెద్దల ప్రసంగం





నగరంలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు

హ్యాపీ.. హ్యాపీ.. క్రిస్మస్

● నగరంలో కళకళలాడిన చర్చిలు ● ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు



కర్నూలు కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అందాల తార.. అరుదెంచె నాకై.. అంబరవీధిలో.. అవతార మూర్తి.. యేసయ్య కీర్తి అంటూ పాడుకుంటూ క్రీస్తు విశ్వాసులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మానవాళి క్షేమం కోసం శిలువపై రక్తాన్ని చిందించిన కరుణామయుడి కరుణ కోసం క్రిస్మస్ రోజున ధ్యానించారు. బుధవారం క్రీస్తు జన్మదినం క్రిస్మస్‌ను పురస్కరించుకుని కర్నూలు నగరంలోని వివిధ చర్చిల్లో పండుగ వాతావరణం నెలకొంది. చర్చి ప్రాంగణాల్లో ఏసు జన్మ వృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక నమూనాలతో అలంకరించారు. నగరంలోని కోల్స్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో సంఘ కాపరి రెవ.ఆర్.అనిల్ శామ్యూల్, ఎస్‌పీజీ (సీఎస్ఐ) చర్చిలో రెవ.వరప్రసాదరావు దైవ సందేశం అందించారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని బిషప్ చర్చిలో బిషప్ జాన్‌వెస్లీ, ప్రార్థన మందిరంలో రెవ. గంటా కరుణ సాగర్, హోసన్న మందిరంలో బ్రదర్ ఫ్రెడి పాల్, హోరేబు ప్రార్థన మందిరంలో బ్రదర్ శాంసన్, షమ్మా చర్చిలో బ్రదర్ స్టీఫెన్ చార్లెస్ భక్తులకు దైవ సందేశాన్ని ఇచ్చారు. నగరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల సందర్భంగా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.





భక్తులకు రొట్టె, ద్రాక్షరసం అందజేస్తున్న పాస్టర్



నంద్యాలలో...



యువతుల ప్రార్థన



ఎమ్మిగనూరులో...





మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న పాస్టర్



కర్నూలు నగరంలోని కోల్స్ చర్చిలో ప్రభు కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని పెద్దమర్రివీడు గ్రామం, నందవరం మండలంలోని జొహరాపురం గ్రామం, ఎమ్మిగనూరు మండలంలోని కందనాతి, కోసిగి మండలంలోని సజ్జలగుడ్డం, కౌతాళం మండలంలోని పోడలకుంట, మంత్రాలయం మండలంలోని బసాపురం, ఆదోని మండలంలోని కపటి, కోసిగి మండలంలోని ఎండవల్లి, హొళగుంద మండలంలోని హొళగుంద, కౌతాళం మండలంలోని మదిరి, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలోని తిప్పాయపల్లె, కల్లూరు మండలంలోని బస్తిపాడు, వెల్దుర్తి మండలంలోని నర్లాపురం, కర్నూలు రూరల్‌లోని ఎదురూరు, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని తుగ్గలి మండలంలోని తుగ్గలి, ఆలూరు మండలంలోని కమ్మరికచేడు, చిప్పగిరి మండలంలోని ఖాజాపురం, ఆస్పరి మండలంలోని తురువగల్, హాలహర్వి మండలంలో గూళ్యం, జే. కొసల్లి గ్రామం మొత్తం 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని పెద్దమకానం వీధికి చెందిన యువతి అదృశ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ బుధవారం రాత్రి తెలిపారు. యువతి తండ్రి నూర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అన్నారు.

ఆంధ్రజ్యోతి
చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

ప్లాట్లు అమ్మబడును
ప్లాట్లు..ప్లాట్లు :- హైదరాబాద్ - బెంగుళూర్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కర్నూలు సిటీ దగ్గరలో ఉన్న ఓర్వకల్లు నందు గవర్నమెంట్ ఆఫీస్‌లను ఆనుకొని 30x45 సైజు 3.10 సెంట్ల ప్లాట్లు కలవు. తేజ : 99487 82417.
AJL_229294

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 224853

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



మార్గం సుగమం

(5వ పేజీ తరువాయి)



నాడు: హొళగుంద-చిన్నహ్యాట రోడ్డు దుస్థితి



నేడు: హొళగుంద-చిన్నహ్యాట రోడ్డు రూ.4 లక్షలతో మరమ్మతులు

● ఉమ్మడి జిల్లాలో రోడ్లు భవనాలు శాఖ పర్యవేక్షణలోని రహదారులు, వివిధ పథకాలు కింద చేపట్టిన పనులు, ప్రస్తుత పురోగతి వివరాలు:

రహదారులు		కర్నూలు	నంద్యాల
బీటీ (తారు) రోడ్లు	(కి.మీలు)	3,029.93	1,300.35
సీసీ రోడ్లు	(కి.మీలు)	307.27	175.47
కంకర రోడ్లు	(కి.మీలు)	27.28	4.88
మట్టి రోడ్లు	(కి.మీలు)	25.27	32.22
మొత్తం		**3,389.75**	**1,512.92**

చేపట్టిన పనులు	227
నిధులు (రూ.కోట్లల్లో)	1,586.69
పూర్తైన పనులు	143
చేసిన ఖర్చు (రూ.కోట్లల్లో)	495.74
మరమ్మతులు పనులు(కి.మీలు)	429
ఇచ్చిన నిధులు (రూ.కోట్లల్లో)	31.34

● 2025లో వీటిపై దృష్టి సారించాలి: 2024కు వీడ్కోలు పలికి.. 2025కు స్వాగతం పలుకుతున్న శుభ వేళ ఉమ్మడి జిల్లాకు చెందిన రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు అసంపూర్తిగా ఉన్న రహదారుల పనులుపై ఫోకస్ పెట్టాలి. గడువులోగా పూర్తి చేయాలి. అదే క్రమంలో కర్నూలు-బళ్లారి వయా కోడుమూరు, ఆలూరు ప్రధాన రహదారిని జాతీయ రహదారిగా మార్చు చేసి నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయాలి. కోడుమూరు-ఎమ్మిగనూరు వయా గోనెగండ్ల రోడ్డు, ఎమ్మిగనూరు-కోసిగి వయా మాలపల్లి రోడ్డు, డాణాపురం-హొళగుంద వయా హెబ్బటం రోడ్డు, ఆలూరు-హొళగుంద వయా ఎల్లార్తి రోడ్డును ఆధునికీకరించాలి. అదే క్రమంలో గుత్తి-మాన్వి వయా పత్తికొండ, ఆదోని రోడ్డును జాతీయ రహదారిగా మార్చు చేసి అభివృద్ధి చేయాలి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు-దోర్నాల వరకు జీకే రోడ్డును నల్లమల అడవిలో నాలుగు రోడ్ల రహదారిగా మార్చు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆటో బోల్తా... బాలుడు మృతి

ఆదోని రూరల్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం గణేకల్లు గ్రామానికి చెందిన బాలుడు అరవింద్(6) రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. బుధవారం గణేకల్లు బంగారమ్మవ్వ దేవర సందర్భంగా గ్రామ శివార్లలో ఉన్న మారెమ్మ దేవాలయానికి పూజల నిమిత్తం బంధువులు ఆటోలో బయల్దేరగా.. అరవింద్ కూడ వెళ్లాడు. ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో అరవింద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు నాగవేణి, రామాంజనేయులు ప్రమాద స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్ఐ ఆశోక్ కుమార్ తెలిపారు.

వ్యక్తిపై దాడి... కేసు నమోదు

ఉయ్యాలవాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రూపనగుడి గ్రామాని కి చెందిన శేషుగాల్ల రమేష్‌పై అదే గ్రామానికి చెందిన ముసల్లిగాల్ల నాగేంద్ర, నాగార్జునలు దాడి చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. రమేష్ దంపతులు మంగళవారం రాత్రి చర్చికి వెళ్తుండగా పాత గొడవలు మనసులో పెట్టుకొని దాడి చేశారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.





పదింతల ప్లానింగ్

వంద రోజుల తరగతులకు శ్రీకారం

విద్యాశాఖ ఎస్‌ఈఆర్టీ ఆధ్వర్యంలో సిద్ధం

చాగలమర్రి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాల విద్యాశాఖ ఎస్‌ఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్వహణతో పాటు మరికొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఆదివారం కూడా అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 28,294 మంది ఉన్నారు. ఎయిడెడ్ పాఠశాలలో 16, ఏపీఎంఎస్ 20, బీసీ 6, ప్రభుత్వ పాఠశాలు 12, కేజీబీవీ 26, ఎంపీఎల్ 4, పీవీటీ 172, ఎస్‌డబ్ల్యూ 5, టీడబ్ల్యూ 12 జెడ్పీ పాఠశాలలు 182 ఉన్నాయి. ఇందులో బాలికలు 12,085, బాలురు 13,209 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ విద్యార్థులు ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

● ఉదయం 8 గంటల నుంచి 5 గంటల వరకు మధ్యాహ్నం 2.40 గంటల నుంచి 4 గంటల వరకు

● ఆదివారాల్లో ఉదయం 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 వరకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.

● ఇవి మార్గదర్శకాలు

● విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, అదనపు తరగతుల నిర్వహణ, నిత్యం చిన్న చిన్న పరీక్షలు పెట్టడం, అవసరమైన పాఠాల పునశ్చరణ, పబ్లిక్ పరీక్షల బ్లూప్రింట్ నమూనాలో ప్రీ ఫైనల్ నిర్వహించి భయం పోగొడతారు.

● ఉన్నతాకారుల పర్యవేక్షణకు వీలుగా ప్రతి విద్యార్థి జవాబు పత్రాలు, మార్కుల పత్రాలను భద్రపరచడం, రానున్న రోజుల్లో ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-1 గ్రాంట్ టేస్టు, ప్రి ఫైనల్ పరీక్షల సన్నద్ధత దీనిలో భాగమేనని, ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

● అదే సమయంలో మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తేదీలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు.



పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో పది విద్యార్థులు

● విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించి, వారికి పరీక్షలు పెట్టి వచ్చిన మార్కుల ఆధారంగా వారిని గ్రేడ్‌లుగా విభజిస్తారు. తదనుగుణంగా వారికి బోధించి మంచి ఫలితాలు సాధించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

● పాఠశాల వారీగా ప్రభుత్వం హోలిస్టిక్ కార్డులు ఇటీవల పంపిణీ చేసింది. వీటిపై ఇప్పటి వరకు అంతర్గతంగా నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను ముద్రించి తల్లిదండ్రులకు అందజేయనున్నారు. వందరోజుల దీక్షలో ఎంఈవోలు పర్యవేక్షణ చేసి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ప్రోత్సహిస్తూ పర్యవేక్షణ చేస్తారు.

జిల్లాలో మంచి ఫలితాలు సాధిస్తాం



జిల్లాలో మంచి ఫలితాలు సాధించే దిశగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలవుతుంది. విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించి వారి మదింపు అంచనా వేసి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటాం. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

– జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల జిల్లా



ఘనంగా క్రిస్మస్

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- యేసు సందేశాన్ని వినిపించిన పాస్టర్లు


కొత్తపల్లి: గువ్వలకుంట్లలో శిలువ ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు


జూపాడుబంగ్లా: తంగడంచలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు


మిడుతూరు ఏబీఎం చర్చిలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


పగిడ్యాలలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్, క్రైస్తవులు


వెలుగోడులోని సీఎస్ఐ చర్చిలో..

క్రిస్మస్ పండుగను క్రైస్తవులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. ఫాదర్లు యేసు సందేశాన్ని వినిపించారు. ప్రముఖులు ప్రార్థన మందిరాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా కేకులు కట్ చేసుకొని సంబరాలు చేసుకున్నారు. క్రైస్తవులు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. శిలువ ఊరేగింపు నిర్వహించారు. మత పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యేసు సూచించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. సర్వమానవాళికి ప్రేమసందేశం అందించిన సంతోషకరమైన శుభదినమే క్రిస్మస్ అని చెప్పారు.


నంద్యాల కల్చరల్: నంద్యాలలోని యేసుకృప మందిరంలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు


నంద్యాల కల్చరల్: తెలుగు బాపిస్టు రక్షణాలయంలో ప్రార్థన చేస్తున్న ఫాదర్ విజయభాస్కర్


నంద్యాల కల్చరల్: పట్టణంలోని పెద్దచర్చిలో యేసు సందేశం వినిపిస్తున్న రెవరెండ్ కొత్తమోసి జోసఫ్


గడివేముల ఏబీఎం చర్చిలో సందేశం వినిపిస్తున్న ఫాదర్


ఆత్మకూరు రూరల్: బాపనంతాపురంలో..


ఆత్మకూరులోని ఎస్పీజీ పాలెం సీఎస్ఐ చర్చిలో ఏసుక్రీస్తు బోధనలు వినిపిస్తున్న పాస్టర్


పాములపాడు: జెరూసలేం చర్చిలో వేషధారణలో క్రైస్తవులు


ఆత్మకూరు రూరల్: అమలాపురం గ్రామంలో..


వెలుగోడులోని ఆర్సీఎం చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు


నంద్యాల కల్చరల్: తెలుగు బాపిస్టు రక్షణాలయంలో ప్రార్థనలో పాల్గొన్న భక్తులు


నందికొట్కూరులో..

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


కబడ్డీ పోటీల్లో తలపడతున్న క్రీడాకారులు

మిడుతూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుక సందర్భంగా మండల కేంద్రం మిడుతూరు గ్రామంలో ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో సంఘ నిర్వహకులు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొన్నాయి. హోరా హోరి పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి నుంచి నాలుగు బహుమతులు రూ.20 వేలు, రూ. 15 వేలు, రూ.10 వేలు, రూ. 5 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు'

వెలుగోడు డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎఎస్ఐలు శాషావలి, ఉస్సేన్ హెచ్చరించారు. బుధవారం పలు ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిపై డ్రోన్ కెమారాతో నిఘా ఉంచారు. ఆ ప్రాంతాలను గుర్తించి పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకొని బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిని పట్టుకొని మూడు కేసులు నమోదు చేశారు. అలాగే స్థానిక పాత బస్టాండులో ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసులు శివయ్య ఉన్నారు.

రైతుల అవస్థలు

- మూడు రోజులుగా కమ్ముకున్న మబ్బులు
- ధాన్యం తడవకుండా పట్టలు కప్పి కాపలాగా ఉంట్ను అన్నదాతలు


నెహ్రూనగర్‌లో వరి ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు


ముచ్చుమర్రి సమీపంలో వరి ధాన్యంపై పట్టలు కప్పిన దృశ్యం

పగిడ్యాల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా మబ్బులు కమ్ముకోవడంతో వరి రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. మండలంలోని వివిధగ్రామాల్లో వరి పంటలను నూర్పిడి చేసే పనులల్లో రైతులు నిమగ్నమయ్యారు. రైతులు ధాన్యాన్ని రోడ్లు, పొలాలల్లో ఆరబెట్టుకొన్నారు. అయితే తుపాన్ ప్రభావంతో మబ్బులు కమ్ముకోవడంతో ధాన్యంపై టార్పాలిన్ పట్టలు కప్పి ఉంచారు. చేతికి వచ్చిన పటంలు కోత దశలో ముసరు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

శ్రీశైలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్న ప్రసాద వితరణ పథకానికి కర్నూలుకు చెందిన ఎ.రాజేంద్ర ప్రసాద్ కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,00,116 విరాళాన్ని, అనంత పురానికి చెందిన కె.సుబ్బా రావు రూ.1,01,111 విరాళాన్ని దేవస్థానం అధికారులకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్ర పటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.



వాజ్‌పేయికి ఘన నివాళి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని అట ల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సభ్యులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి ప్రధానికిగా సుపరిపాలన అందజేసి చరిత్రలో నిలిచారని కొనియాడారు. వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు శేషఫణి, సభ్యులు శ్రీనివాసులు, సాంబశివారెడ్డి, కిరణ్, సంతోష్, రాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాచ్‌పేయి జయంతిని పురస్కరించుకొని ఆత్మకూరులోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశంలో చెప్పుకోదగ్గ వ్యక్తుల్లో వాజ్‌పేయి ఒకరు అని అన్నారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు సాంబశివగౌడ్, నాయకులు గోపాల్, నూర్‌బాషా, మహేష్‌బాబు, అస్మతుల్లా తదితరులు ఉన్నారు.

- ఆత్మకూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ఆ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ మోమిన్ షభాన ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.


ఆత్మకూరులో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

పాములపాడు(ఆంధ్రజ్యోతి): పాములపాడులో మాజీ ప్రధానిని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్లా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం వాజ్‌పేయ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాయపాటి మురళీమోహన్, హేమచంద్ర, నాగరాజు, రాజశేఖరశెట్టి, అవులయ్య, గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తుడికి బంగారు డాలర్ అప్పగింత

మహానంది, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రానికి దర్శనార్థమై వచ్చి కోనేటి లో పుణ్య స్నానాలు చేస్తుండగా పొరపాటున జార విడుచుకొన్న బంగారు డాలర్‌ను వెతికించి తిరిగి భక్తుడికి ఆలయ అధికారి చేతుల మీదుగా అందజేశారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన రాజశేఖర్ అనే భక్తుడు స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకొనేందుకు వచ్చారు. అయితే ముందుగా స్నానం చేసేందు కోసం రెండవ ప్రాకారం లోని కోనేరులో భక్తుడు దిగారు. ఈక్రమంలో బంగారు డాలర్ పడిపోయింది. ఈ విషయాన్ని అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శివరామ్‌కు తెలిపారు. దీంతో స్థానిక చెంచు యువకుల ద్వారా కోనేరులో వెతికించారు. దొరికిన బంగారు డాలర్‌ను ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు ద్వారా తిరిగి భక్తుడికి అప్పగించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి



వాజ్‌పేయికి నివాళి అర్పిస్తున్న నాయకులు

బేతంచెర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వికాజ భారతి కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలు హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు నాగ మోహన్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా అటల్ బిహారి వాజ్‌పేయి దేశ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సురభీ గోశాల అధ్యక్షుడు మారుతి శర్మ, వికాస భారతి సంఘటన కార్యదర్శి బాలేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుమోహన్ రెడ్డి, ఎల్ఐసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం టీడీపీ తోనే సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు. బుధవారం చాగలమర్రి బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో అధిక ప్రాధాన్యత, ప్రత్యేక రక్షణ చట్టం కల్పిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

అవమానించడం తగదు

కొలిమిగుండ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గౌతు లచ్చన్న విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న టీడీపీ ప్రజా ప్రతినిధులను ఆ పార్టీ నేతలే అవమానించడం సరికాదని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి కర్నూల్ జిల్లా గౌడ్ సంఘం ఉపాధ్యక్షులు కొండయ్యగౌడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతతో కలిసి వేదికను పంచుకున్నారంటూ బీసీ నేతలు మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులచే క్షమాపణలు చెప్పించి, అవమానించడం టీడీపీకి తగదని అన్నారు. బీసీల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బీసీ ఇందిరమ్మ పర్యటన

కొలిమిగుండ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మహిళా నేత బీసీ ఇందిరమ్మ బుధవారం కొలిమిగుండ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కోటపాడు శివరామిరెడ్డి, అందె రాము, కొప్పుల శివ, మధు తదితరులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడిన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యకర్త వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కోవెలకుంట్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండేకంటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో గురువారం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బుధవారం పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి రామ్ ఆసుపత్రి వైద్య బృందం చేత ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు మద్దతు



జౌళి బ్యాగులను ప్రదర్శిస్తున్న హోటల్ యజమానులు

బనగానపల్లె, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ చేపట్టిన ప్లాస్టిక్ నిర్మూలన ఉద్యమానికి బనగానపల్లె హోటల్ అసోసియేషన్ సభ్యులు బుధవారం మద్దతు ఇచ్చారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ ఇందిరమ్మతో కలిసి జౌళిబ్యాగ్‌లు, ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ హైదర్, సెక్రటరీ శ్రవణ్ కుమార్, సభ్యులు ప్రసాద్, వేణు, శంకర్‌నాయక్, గౌస్ ప్రభాకర్, హసన్ ఆలీ, హుస్సేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

బేతంచెర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా బేతంచెర్ల పట్టణం డ్రైవర్స్ కాలనీ, కోటపేట కాలనీల్లో బాల బాలికలకు సీఐటీయూ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి హాజరయ్యారు. బాలబాలికలకు పరుగుపందెం, బాలికలకు మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన బాలబాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో సుహానా, పల్లవి, మానస, అప్సాన, దిశాన్, అమర్, కబడ్డీ తౌశిక్, దస్తగిరి, నాసర్, అమిత్ బాషా, సిద్దిక్, హిమాంవలి, అజ్జు, ఫిరోజ్, ఫారూక్ పాల్గొన్నారు.

నేటి నుంచి కందుల కొనుగోళ్లు

డోన్ రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డోన్ వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం నుంచి కందులు కొనుగోళ్లు చేస్తున్నట్లు డోన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి మాధవ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కందులు పంటను పండించిన రైతులు తమ ఉత్పత్తులను టెండరు ద్వారా క్రయ విక్రయాలు జరుపుకోవచ్చని అన్నారు. వెంటనే నగదు చెల్లింపులు జరుగుతాయన్నారు.

పంట నమోదు తప్పనిసరి

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు ఈ నెల 31 వరకు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని అన్నారు. బీమా చేసుకున్న రైతులకు పంట పరిహారం లభిస్తుందని తెలిపారు.




చాగలమర్రి ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



డోన్, బేతంచర్లలో ప్రసంగిస్తున్న పాస్టర్లు

ఘనంగా క్రిస్మస్



బనగానపల్లె ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు



ఉయ్యాలవాడలో శిలువతో ఊరేగింపు



శిరివెళ్లలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



కోవెలకుంట్లలో..



రుద్రవరంలో గ్రామోత్సవం



ప్యాపిలిలో ప్రార్థనలు

బనగానపల్లె, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. యేసుక్రీస్తు జననం సందర్భంగా చర్చిలను ప్రత్యేకంగా అలంకరించి, చర్చిల ఎదుట పశువుల పాక, క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధరాత్రి బనగానపల్లె పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాస్టర్ డాక్టర్ బాబూరాజ్, సీఎస్ఐ చర్చిల్లో ఫాస్టర్ డి. దైవాదీనం ఆధ్వర్యంలో ప్రార్థనలు ప్రారంభించారు. పాతపాడు, కైప, రామకృష్ణాపురం, పలుకూరు, రామతీర్థం, బీరవోలు, నందివర్గం, నందవరం, జిల్లెల్ల, వెంకటాపురం, టంగుటూరు, అప్పలాపురం, మిట్టపల్లె, ఇల్లూరుకొత్తపేట, తదితర గ్రామాల్లోని క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. చర్చిల వద్ద ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి, క్రిస్మస్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

డోన్ రూరల్: డోన్ మండలంతోపాటు పట్టణంలో క్రిస్మస్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని పాతబస్టాండులోని సీఎస్ఐ చర్చి, వైఎస్ నగర్‌లోని బైబిల్ మిషన్ చర్చి, తారక రామనగర్, డేవిడ్ నగర్, గుత్తిరోడ్డులోని ప్రధాన రోడ్డులో ఉన్న చర్చిలలో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిల్లో ఫాస్టర్లు యేసు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అలాగే మండలంలోని చిన్నమల్కాపురం, ఎర్రగుంట్ల, గుమ్మకొండ, తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

- **ప్యాపిలి:** మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగాయి. ప్యాపిలి, హుసేనాపురం, కలచట్ల, ఊటకొండ, బూరుగుల తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చిల్లో పేదలకు ఆర్థిక సాయం, దుస్తులు పంపిణీ చేశారు.

- **దొర్నిపాడు:** క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. క్రైస్తవులు బుధవారం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు భక్తి గీతాలను ఆలపించారు. యేసు చూపిన మార్గంలో నడవాలని ఆయా చర్చిల ఫాదర్లు క్రైస్తవులకు సూచించారు. యేసు లోకానికి మార్గదర్శకుడని, పాపులను రక్షించి పరిశుద్ధులను చేయటానికి లోకానికి వచ్చాడని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ప్రేమ, దయ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని జీవనం చేయాలని కోరారు. చర్చిలలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలను ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలపాడు 133 ఏళ్ల చరిత్రగల ఎస్పీజీ చర్చిలో ఫాదర్ సంజీవరాజ్ ఆధ్వర్యంలో గుడి ప్రదర్శన, ఆరాధన, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్సీఎం, సీఎస్ఐ, మార్థోమా చర్చిలలో ఫాదర్లు ప్రకాష్, చంద్రశేఖర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తు పుట్టుక గురించి వివరించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, యువతీ యువకులు ఆయా చర్చిల్లో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. పెద్దబోదనం, మద్దూరు, నేలంపాడు, పెద్దవంగలి, గొడిగనూరు తదితర చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- **రుద్రవరం:** క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ సురేష్‌బాబు మాట్లాడుతూ సర్వమాన వాళి రక్షణార్థమై ఏసుక్రీస్తు పశువుల పాకలో జన్మించాడని అన్నారు. క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని మండలంలోని ఆలమూరు, చిత్తరేణిపల్లె, నరసాపురం, ముత్తలూరు, మందలూరు, చందలూరు, పేరూరు, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, రుద్రవరం, కోటకొండ, యల్లావత్తుల గ్రామాల్లో క్రిస్మస్‌పండుగ జరుపుకున్నారు. అర్ధరాత్రి దాటాక మేళతాళాల మధ్య సిలువతో గ్రామోత్సవం నిర్వహించారు.

- **కొలిమిగుండ్ల:** మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లోని చర్చి ప్రాంగణాల్లో పశువుల పాక ఏర్పాటు చేసి, క్రీస్తు ప్రతిమలతో సంబరాలు చేశారు. బెలుంశింగవరం గ్రామంలో క్రిస్మస్ పర్వదినం పురష్కరించుకొని బుధవారం విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన కబడ్డీ జట్టుకు టీడీపీ నాయకులు దొన్నపాటి శంకర్‌రెడ్డి, కట్టుబడి రామ్మోహన్ రూ.3500నగదు బహుమతి అందజేశారు. బెలుం గ్రామంలో సీఎస్ఐ సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు క్రీడా పోటీలను సందర్శించారు. ప్రథమ విజేతగా నిలిచిన తాడిపత్రి శివ జట్టుకు రూ.20,016 బెలుం గ్రామానికి చెందిన కడప జిల్లా సీఐ బి.బాలమద్దిలేటి అందించారు. రెండవ బహుమతి సాధించిన తాడిపత్రి ఈసీఈ స్పోర్ట్స్ జట్టుకు రూ.15,016 గ్రామ సర్పంచ్ నీలమ్మ అందజేశారు. మూడవ బహుమతి రూ.10,016 కొలిమిగుండ్ల ధనరాజ్ అందించారు.

- **కోవెలకుంట్ల:** లోకరక్షకుడు ఏసుక్రీస్తు అని సీఎస్ఐ పాస్టర్ మోహన్‌బాబు అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లోని క్రైస్తవ సోదరులు క్రీస్తు జన్మదినం సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

బేతంచెర్ల: క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా బుధవారం జరుపుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచే పట్టణంలో ఆయా వీధుల గూండా ఏసు శిలువను ఊరేగించారు. సీఎస్ఐ చర్చి ఫాదర్ వినోద్ క్రిస్మస్ వేడుకల గురించి సందేశాన్ని ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



అహోబిలంలో పూజలందుకుంటున్న ప్రహ్లాద వరదుడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి) : అహోబిలంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలను అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా ప్రహ్లాద వరదస్వామి బుధవారం మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ధనుర్మాస పూజా వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ మేనేజర్ మురళీధరన్, ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి

డోన్ రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో బుధవారం పెద్దమ్మతల్లి జాతర కన్నుల పండువగా జరిగింది. తెల్లవారుజాము నుంచే పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి గ్రామంలో పురవీధుల గుండా ఊరేగించారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో రూరల్ సీఐ రాకేష్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భారీగా ప్రజలు తరలిరావడంతో కొచ్చెర్వు గ్రామ పరిసరాలు బైకులు, కార్ల పార్కింగ్‌లతో కిటకిటలాడాయి. డోన్ నియోజకవర్గం తెలుగుదేశం యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు గ్రామ పెద్దలు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

తెలుగు గంగకు నీరు విడుదల



తుండ్లవాగు రిజర్వాయరు నుంచి విడుదలైన నీరు

రుద్రవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అడవిలోని తుండ్లవాగు రిజర్వాయరు నుంచి నీటిని తెలుగుగంగ ప్రధాన కాలువకు అధికారులు విడుదల చేశారు. గతంలో ప్రధాన కాల్వకు నీరు నిలపివేసిన విషయం విదితమే. మళ్లీ విడుదల చేయడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం




శఙ్జారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు, మైనార్టీసెల్ నాయకుడు కొలిమిడుసేన్‌వలి అన్నారు. బుధవారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో సాగునీటి సంఘ అధ్యక్షురాలిగా ఎన్నికైన శఙ్జారెడ్డిని టీడీపీ నాయకులు సన్మానించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరవతో టీడీపీ సాగునీటి సంఘం చాగలమర్రి మండల కమిటీ అధ్యక్షురాలిగా శఙ్జారెడ్డిని ఎన్నుకోవడం సంతోషం అన్నారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘ అధ్యక్షురాలు సల్లా మహాలక్ష్మి, బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, అమీర్, చోటు, రమేష్, బాలదస్తగిరి, వెంకటయ్య, మహేంద్రాచారి పాల్గొన్నారు.

రూ.2.57 కోట్లతో అభివృద్ధి పనులు

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రూ.2.57 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పంచాయతీ రాజ్ ఏఈ ఏఈ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో రూ.23 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేశామని అన్నారు. చాగలమర్రిలో రూ.30 లక్షలు, పెద్దవంగలిలో రూ.15 లక్షలు, శెట్టివీడు రూ.10 లక్షలు, గొడిగనూరు రూ.15 లక్షలు, డి.వనిపెంటలో రూ.8 లక్షలు, కొత్తపల్లెలో రూ.16 లక్షలు, ముత్యాలపాడు రూ.23.50 లక్షలు, చక్రవర్తులపల్లె రూ.15 లక్షలు, తోడెండ్లపల్లె రూ.19.50 లక్షలు, నేలంపాడు రూ.20 లక్షలు, రాంపల్లె రూ.4 లక్షలు, పెద్దబోదనం రూ.15 లక్షలు, చిన్నబోదనం రూ.23 లక్షలు, తోడెండ్లపల్లె రూ.5 లక్షలు, చింతలచెరువులో రూ.15 లక్షలు, పల్లె పండుగ నిధులతో రోడ్లు, మురికి కాలువ పనులు చేపట్టామని ఏఈ పేర్కొన్నారు. సంక్రాంతి నాటికల్లా ఆయా గ్రామాల్లో పనులు పూర్తి చేస్తామని అన్నారు.

పెరిగిన చలి.. కమ్మేస్తున్న మంచు



చాగలమర్రిలో ఉదయం తొమ్మిది గంటలైనా విడని పొగమంచు

చాగలమర్రి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. చలికి ప్రజలు గజగజ వణికిపోతున్నారు. బుధవారం ఉదయం 9 గంటలు దాటిన మంచు తెరలు వీడలేదు. మంచు దట్టంగా ఉండటం వల్ల సూర కిరణాలు భూమిపై ప్రసరించడం లేదు. ఒక్కసారిగా చలి ఎక్కువ కావడంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, రోగులు చలి తీవ్రతను తట్టుకోలేకపోతున్నారు. పంట పొలాలపై పొగమంచు దట్టంగా కప్పేసింది. హైవే రహదారిలో పొగమంచు నిండుగా ఉండటంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వస్తోంది. కంది, శనగ పంటల పూత రాలి దెబ్బతింటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



హైవే రహదారిపై లైట్లు వేసుకొని వెళ్తున్న ట్రాక్టర్